# నగుమోము

-ఎన్.వి.శ్రీధరశర్మ

బద్ధకంగా నిద్రలేస్తూ బెడ్‌కు ఎదురుగా కొత్తగా బిగించిన డ్రెస్సింగ్ టేబుల్ అద్దంలో తన మొహాన్ని చూస్తూ ముసిముసిగా నవ్వుకున్నాడు ప్రభాకర్. అప్రయత్నంగానే అతని కళ్ళు ప్రక్కకి గోడమీద ఉన్న గడియారంపై పడ్డాయి. టైం 8-45 చూపిస్తోంది.

"సుజాత" అంటూ గావుకేక పెట్టాడు ప్రభాకర్.

"ఏమిటండీ అంతగా గావుకేక పెట్టారు?" అడిగింది కిచెన్‌లోంచి పరిగెత్తుకుంటూ వచ్చిన సుజాత.

"టైం 8-45 అవుతున్నా నన్ను లేపకపోవడంలో ఏంటి నీ ఉద్దేశ్యం?" సీరియస్‌గా ప్రశ్నించాడు ప్రభాకర్.

"మిమ్మల్ని ప్రొద్దున్నే నిద్రలేపడం, ఆరోజు ఏచిన్న చెడు సంఘటన జరిగినా మా మొహాల్ని చూసినందుకే అని మీరు గోల చేయడం మామూలు అయింది. అందుకే ఈరోజు నుంచి నేను గానీ పిల్లలు గానీ చివరకు పనిమనిషి కూడా మిమ్మల్ని నిద్ర లేపదు. మీరుగా మీరే లేవాలి. అసలే టైం అయింది తొందరగా. స్నానం చేసి రండి. టిఫిన్ చల్లారిపోతుంది" అని చెప్పి కిచెన్‌లోకి వెళ్ళిపోయింది సుజాత.

హడావుడిగా స్నానం చేసిన ప్రభాకర్ టిఫిన్ ముగించుకుని బైక్ స్టార్ట్ చేసి ఆఫీసుకు బయలుదేరాడు హెల్మెట్ లేకుండా.

* * *

"మిస్టర్ తలపై హెల్మెట్ ఏది?" ప్రశ్నించాడు ట్రాఫిక్ ఎస్ఐ.

"సారీ సర్ హడావుడిలో మర్చిపోయాను" దీనంగా చెప్పాడు ప్రభాకర్.

"అయితే సాయంత్రం కౌన్సిలింగ్ క్లాసుకు వచ్చి ఫైన్ కట్టి బండి తీసుకుని పో" అంటూ బైక్ కీస్ తీసుకున్నాడు ఎస్ఐ.

"సార్ మొన్న కౌన్సిలింగ్ క్లాసుకు వచ్చినప్పటి నుంచీ వాచిపోయిన బుర్ర సైజు ఇంకా తగ్గనేలేదు. ఆ దెబ్బకు హెల్మెట్ కూడా సరిగా పట్టడం లేదు. ఇంతలోనే మరో కౌన్సిలింగా? దయచేసి నన్ను వదిలేయండి. కావలిస్తే ఆ ఫైన్ ఏదో ఇక్కడే కట్టేస్తాను" వేడుకున్నాడు ప్రభాకర్.

"సరే ఫైన్ కట్టేసి వెళ్ళు" కనికరించాడు ఎస్ఐ చలానా రాస్తూ.

మళ్ళీ బైక్ స్టార్ట్ చేసి కొంతదూరం వెళ్లాడో లేదో 'నేనిక కదల్లేను మహాప్రభో' అంటున్నట్లుగా బైక్ ఆగిపోయింది. అప్పటికి గానీ గుర్తుకురాలేదు ప్రభాకర్‌కు రాత్రి పెట్రోల్‌ను రిజర్వ్‌లో పెట్టిన సంగతి.

బైక్‌ను దగ్గర్లోని రాజయ్య కిళ్లీ కొట్టు వద్ద పార్క్ చేశాడు ప్రభాకర్.

"రాజయ్యా! బండిలో పెట్రోల్ అయిపోయింది. నేను సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చేటప్పుడు తీసుకెళతాను. అంతవరకూ కాస్త బండిని చూస్తుండు" చెప్పాడు ప్రభాకర్.

"అట్లాగే బాబూ. అయితే బండిని రోడ్డుకు కాస్త ఎడంగా పెట్టండి. ట్రాఫిక్ పోలీసులు వస్తే ఇబ్బంది అవుతుంది" చెప్పాడు రాజయ్య.

"అసలే ట్రాఫిక్ తక్కువగా ఉండే ఈరోడ్డులో ట్రాఫిక్ పోలీసులు ఎందుకు వస్తారు. అక్కడే ఉండనీ!" అని చెప్పి ఆఫీసుకు వెళ్ళే సిటీబస్ రావడంతో బస్సెక్కాడు ప్రభాకర్.

* * *

'థ్యాంక్ గాడ్! బస్సు రద్దీగా ఉన్నా కండక్టర్ ప్రక్క సీటు ఖాళీగానే ఉంది' అనుకుంటూ సీట్లో కూర్చోబోయిన ప్రభాకర్ ఆ బస్సుకు లేడీ కండక్టర్ అని తెలుసుకుని ఆ ప్రయత్నాన్ని విరమించుకుని కడ్డీ పట్టుకుని నించున్నాడు.

బస్సు డ్రైవర్ తన శక్తినంతా కూర్చి బలంగా బ్రేక్ వేయడంతో ప్రభాకర్ గాలిలోకి ఎగిరి డ్రైవర్ ప్రక్కనే చేపల బుట్టలో పడడంతో అతని డ్రెస్ పాచిమరకలతో ఫ్యాషన్‌షోలో ప్రదర్శించే కొత్త డిజైన్‌లాగా మారిపోయింది.

"అదేంటిసార్ ఎవరైనా గారెల బుట్టలో పడతారు. మీరేంటి చేపల బుట్టలో పడ్డారు" అన్నాడు డ్రైవర్ నవ్వుతూ.

"నీకేమైనా బుద్ధుందా? అంత సడెన్ బ్రేక్ వేస్తే ఎలా?" కోప్పడ్డాడు ప్రభాకర్.

"కోడిసార్ కోడి. రోడ్డుమీద గుడ్డు పెట్టి వెళ్లిపోయింది. అసలే పసిగుడ్డు కదండీ. దాన్ని చంపడం ఇష్టంలేక బ్రేక్ వేశాను" సంజాయిషీ ఇచ్చాడు డ్రైవర్ గేర్ మారుస్తూ.

తను దిగాల్సిన స్టేజ్ రావడంతో మాసిన బట్టల్ని దాచుకుంటూనే ఆఫీసు వైపు పరుగులాంటి నడకను ప్రారంభించిన ప్రభాకర్ ఒక్కసారిగా ఆగిపోయాడు.

తన కంటి ముందుగానే ఆఫీసులోకి వెళ్తున్నాడు డిఎం (దుర్వాసముని అలియాస్ డివిజనల్ మేనేజర్).

అతని చేతిలో లేటుగా వచ్చిన తన పని అయిపోయినట్టే అనుకుంటూ భయంగా భయంగా ఆఫీసులోకి అడుగుపెట్టాడు.

దసరా మామూలు ఇవ్వలేదన్న కోపం అటెండెన్స్ రిజిష్టర్‌ను డీయం రూంలో పెట్టేసి తీర్చుకున్నట్టున్నాడు మెసెంజర్.

అటెండెన్స్ వేయడానికి డీయం ఛాంబర్‌లోకి వెళుతున్న ప్రభాకర్‌ను బలికి వెళుతున్న మేకపిల్లలా చూస్తూ ముసిముసిగా నవ్వుతున్నాడు మెసెంజర్.

భయం భయంగానే డీయం రూంలోకి వెళ్లాడు ప్రభాకర్. అప్పటికే హాజరుపట్టీలో సంతకం పడనివాళ్లని పరిశీలిస్తున్నాడు దుర్వాసముని.

"ఎందుకు ఆలస్యం అయింది" అని కళ్లతోనే ప్రశ్నించాడు డీయం.

"సార్ అదీ బైక్‌లో...పెట్రోల్..." చెబుతున్న ప్రభాకర్ టెలిఫోన్ మోగడంతో ఆగిపోయాడు.

డీయం గారికి మిసెస్ దుర్వాసముని ఫోన్ చేసినట్లుంది.

సంతకం చేసి వెళ్లిపొమ్మని సైగ చేయడంతో ప్రభాకర్ సంతకం చేసి బయటపడ్డాడు గ్రహంబెల్‌కు, మిసెస్ డీయంకు కృతజ్ఞతలు మనసులోనే చెప్పుకుంటూ.

* * *

"సార్ డీయం గారు పిలుస్తున్నారు" అని చెప్పాడు ప్రభాకర్‌తో మెసెంజర్ మరోసారి నవ్వుకుంటూ.

పొద్దున్న ఇవ్వాలనుకున్న డోసు ఇప్పుడు ఇస్తాడేమో అనుకుంటూ డీయం ఛాంబర్‌లోకి



వెళ్లాడు ప్రభాకర్ మళ్లీ భయంగానే.

"చూడు ప్రభాకర్ రేపు కంపెనీ ఆడిటర్స్ వస్తున్నారు. కాబట్టి మనమిద్దరం ఈరోజు రాత్రి ఆఫీసులోనే ఉండి ఆ అకౌంట్స్ సెటిల్ చేయాలి. సరేనా?'' అన్నాడు డీయం గంభీరంగా.

తన ప్రమేయం లేకుండానే ప్రభాకర్ తల అటు ఇటూ ఊగింది సరే అన్నట్లు.

"వెంటనే మీ ఇంటికి ఫోన్ చేసి రాత్రి రావడం లేదని చెప్పండి'' అన్నాడు డీయం.

అసంకల్పితంగానే ఆ పనిచేశాడు ప్రభాకర్.

పనిలో మునిగిపోయిన వారిద్దరి మధ్య నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ మ్రోగింది టెలిఫోన్.

మళ్లీ మిసెస్ దుర్వాసముని.

ఫోన్‌లోని ప్రతి ప్రశ్నకూ "సరే.. అలాగే...ఓకే'' అంటూ సమాధానాలిస్తూ ఫోన్ పెట్టేశాడు డీయం.

"చూడండీ ప్రభాకర్‌గారు నాక్కూడా ఇంట్లో అర్జెంట్ పని పడింది. కాబట్టి మనం ఈ పని ప్రొద్దున్న అర్లీగా వచ్చి ఫినిష్ చేద్దాం. రండి నేను మిమ్మల్ని ఇంటి దగ్గర దిగబెడతాను'' చెప్పాడు డీయం.

"సార్ నన్ను కిళ్లీ కొట్టు దగ్గర డ్రాప్ చేయండి. నా బైక్ తీసుకుని వెళ్లిపోతాను'' అని ప్రభాకర్ చెప్పడంతో అతనిని రాజయ్య కిళ్లీ కొట్టు దగ్గర దింపేసి వెళ్లిపోయాడు డీయం.

★ ★ ★

ప్రభాకర్‌ను చూడగానే కొట్టులోంచి పరిగెత్తుకుంటూ వచ్చాడు రాజయ్య.

"సార్ మీ కోసమే ఎదురుచూస్తున్నాను. మీరు ప్రొద్దున్న వెళ్ళిపోగానే ట్రాఫిక్ పోలీసులు వచ్చారు. రోడ్డుకి అడ్డంగా ఉన్న మీ బైక్‌ను క్రేన్‌కు కట్టేసి లాక్కొని పోయారు'' చావు కబురు చల్లగా చెప్పాడు రాజయ్య.

'ఓ గాడ్ ఏమిటి ఈరోజు నాకీ కష్టాలు!'' అని అనుకుంటూనే పోలీస్ స్టేషన్‌కు బయలుదేరాడు ప్రభాకర్.

★ ★ ★

"సార్ నా పేరు ప్రభాకర్. ప్రొద్దున్న నా బైక్‌ను మీరు తీసుకొచ్చారుట. ఫైన్ కట్టేసి విడిపించుకుని పోదామని వచ్చాను'' చెప్పాడు ప్రభాకర్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఎస్ఐతో.

"తీసుకుని రావడంకాదు, క్రేన్‌తో ఈడ్చుకుని వచ్చాం'' చెప్పాడు బుగురు మీసాల ఎస్ఐ.

ఫైన్ కట్టేసి బైక్‌ని తోసుకుంటూ ఇంటి ముఖం పట్టాడు ప్రభాకర్.

★ ★ ★

కాలింగ్‌బెల్ మ్రోగడంతో వెళ్లి తలుపుతీసింది సుజాత.

ఎదురుగా మాసిపోయిన బట్టలతో, పాలిపోయిన ముఖంతో దీనంగా ఉన్న ప్రభాకర్‌తో "అదేంటండీ ఏమైనా యాక్సిడెంట్ జరిగిందా? అయినా రాత్రికి రానని ఫోన్ చేశారు. ఇంత ప్రొద్దుపోయిన తర్వాత వచ్చారేమిటి?'' ప్రశ్నించింది సుజాత.

"అవును ప్రొద్దున్నే లేచి ఎవడి మొహం చూశానో గానీ అదే పెద్ద యాక్సిడెంట్'' అంటూ జరిగిన సంఘటనలన్నీ చెప్పాడు ప్రభాకర్ సుజాతతో.

"ప్రొద్దున్నే మీ నగుమోమును మీరే చూసుకున్నారు డ్రెస్సింగ్ టేబుల్ అద్దంలో గుర్తులేదా?'' నవ్వుతూ అంది సుజాత.


"ఓరినాయనో! నా ముఖం నేను చూసుకున్నందుకే ఇన్ని అనర్థాలు జరిగాయా?'' అనుకుంటూనే సోఫాలో కూలబడ్డాడు ప్రభాకర్.

"తినడానికి ఏమైనా ఉంటే పట్రా. ప్రొద్దున్న టిఫెన్ చేసిన తర్వాత మరేం తినలేదు. కడుపులో పరిగెత్తి పరిగెత్తి ఎలుకలు కూడా సొమ్మసిల్లి పడిపోయాయి'' హీనస్వరంతో చెప్పాడు ప్రభాకర్.

"అయ్యో సారీ అండీ మీరు రారు అనుకుని చేసుకున్నదంతా మేమే తినేశాం. మళ్లీ వండుదామంటే గ్యాస్ సిలిండర్ అయిపోయింది. ప్రొద్దున్నగాని సిలిండర్ రాదు. పైగా మిగిలి ఉన్న పాలనుకూడా ఇందాక పిల్లి తాగేసింది'' గడగడమంటూ చెప్పేసింది సుజాత.

"అయితే నాదొక విన్నపం. నన్ను బెడ్‌రూంలోకి మోసుకునిపోయి బెడ్ మీద పడుకోబెట్టండి. ప్రొద్దున్నే నేను లేచేసరికి ఎదురుగా అద్దం తీసేయండి. మీలో ఎవ్వరైనా ఒకరు నన్ను లేపండి. మిమ్మల్ని ఈరోజు నుంచి ఏమీ అనను'' అంటూ సోఫాలోనే మూర్ఛపోయాడు ప్రభాకర్.

★



## లక్ష్యం

బాలీవుడ్‌లో ఇంతదాకా సరైన సక్సెస్ దొరకలేదు. అందుకనే ఇక లారా పనైపోయిందని అంతా చెప్పుకుంటున్న సమయంలో లారా ఈమధ్య గొంతు విప్పి గట్టిగా చెప్పింది- 'గతంలో చేసిన పొరపాట్లు ఇకపై చేయకుండా నా కెరీర్‌ని ప్లాన్ చేసుకుందామనే నిర్ణయానికి వచ్చాను. కేవలం ముప్పయ్యేళ్లకే నా సినీ జీవితం ఫినిష్ అయిపోయిందని నేను అనుకోను. భగవంతుడి దయవల్ల నాకు కొంత టాలెంట్ వుందనే అనుకుంటున్నాను. దాంతో నేనేంటో నిరూపించుకునే తీరతాను. వీలున్నంతవరకూ నటిగానే కొనసాగుతాను' అంటూ స్టేట్‌మెంట్స్ ఇస్తోంది లారాదత్తా.

